


# సంధ్యారాగం

- ఆర్. సత్యాదేవి



సాయంత్రం ఆరు గంటలు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా మద్రాసు వెళ్ళే ఎయిర్ బస్సు. సీటు నంబరు 12 ఎ.లో కూర్చున్నాడు శ్రీధర్. అతనిది విండో సీటు. విమాన ప్రయాణం ఎంజాయ్ చెయ్యాలంటే విండో సీటులోనే కూర్చోవాలనేది అతని వ్యాఖ్య. ఆరడుగుల రెండంగుళాల పొడవు, యోగాసనాలు, ఎక్సర్‌సైజు మూలంగా దృఢంగా ఉన్న శరీరావయవాలు, గోధుమ రంగు, ట్రిమ్ చేసిన గడ్డం. అమ్మాయిలు మెచ్చుకునే అన్ని హంగులూ ఉన్న ఇరవై ఎనిమి దేళ్ళ వయసున్నవాడు శ్రీధర్.

సీటు వెనక్కు వాలి రిలాక్సింగ్‌గా కళ్ళు మూసుకుని ఉన్నాడు. టేక్ ఆఫ్ ముందు జరిగే కలకలం ఏమీ అతన్ని ఇబ్బంది పెట్టలేదు. విమానం గాలిలోకి లేచి స్టెడీ అయిన తరువాత మెల్లగా కళ్ళు విప్పాడు. దూరంగా అస్తమించే ఎర్రని సూర్యబింబం. ప్రకృతి మాత పెట్టుకున్న ఎర్రని కుంకుమబొట్టు. ఎరుపు పసుపు కలిసిన ఈ సంధ్య ఎంత అందం ! అపురూపం ! అయినా ఇంకెంతసేపు? క్షణం ! విమానం దిగమారేసరికి ఆ దృశ్యం కనుమరుగైంది. శ్రీధర్ పెదవులపైన నవ్వు.

కాఫీ జగ్గుతో, ఆకుపచ్చ ప్రింటెడ్ చీరలో ఏర్ హోస్టెస్. కప్పులో కొంచెం డికాక్షన్, పాలు పోసి వెళ్ళిపోయింది. దాని కలరు చూసేసరికి తిరిగి పెదవులపైన చిన్న నవ్వు.

"ఇండియన్ ఏర్‌లైన్స్ కాఫీ కంటే తీసిపోయిందా నా కాఫీ !" వసంత టీజింగ్.

రెండు సిప్పులు తాగేసరికి గొంతులో ఒకలాంటి రుచి. రెండు గంటల ప్రయాణంలో మొదటి పది నిమిషాలు తనివితీరని సంధ్యారాగం. తరువాత కాఫీ తతంగం. దాంతోపాటే గుండె అవలి పొరల నుంచి వచ్చే వసంత. తల తిప్పి చూశాడు. తన పక్క సీటులో ఎవరూ లేరు. దాదాపు పావు వంతు ఖాళీగా ఉంది. నిదానంగా పోతోంది విమానం. ఎనిమిది గంటలకు హైదరాబాద్ చేరతాడు. తరువాత రొటీన్.

ఈ బ్రతుకే రొటీన్. ఏం ప్రత్యేకత ఉంది? ఒంటరితనం. మనసు పొరల్లోంచి ఉబికి ఉబికి వచ్చే బాధ. అన్నీ ఉండి ఏమీలేని నిస్సహాయత. ఉద్వేగంగా ఉంది. ఒక్కసారి తల విదిలించి తనకు తను కంట్రోల్‌కు వచ్చాడు. బయటకు చూస్తూ కూర్చున్నాడు. విమానం చాలా ఎత్తులో పోతోంది. చీకటి తప్ప మరీమీ లేదు. తన బ్రతుకులాగానే ఉంది. పది నిమిషాలు మురిపించి మాయమైన సంధ్య. గుండెల్లో గుడి కట్టి పూజించా లనుకున్న సంధ్య. వీళ్ళు తప్ప ఇంత విశాల ప్రపంచంలో నీ కెవరూ లేరా? అప్పుడప్పుడూ నిలదీసే అంతరాత్మకు బదులు చెప్పలేక దాసోహమనేది సిగరెట్టు.

పదేళ్ళ క్రితం మొదటిసారి విమాన ప్రయాణం చేసినప్పుడు కలిగిన సంతోషంతో కూడిన ఉద్వేగం, అనుభవించాలే కానీ మాటలతో చెప్పలేడు. బావగారితో మొదటి ప్రయాణం హైదరాబాద్ నుంచి మద్రాసు. దాదాపు గంట. ఆ

సంతోషపు అంచులు చేరకముందె ప్రయాణం పూర్తయింది. తరువాత ఎంత దూరం, ఎన్ని దేశాలు, ఎన్ని గంటలు, ఈ ఎయిర్ క్రాఫ్ట్ నడిపే పైలట్ కంటే ఎక్కువే ఉండొచ్చు తన ప్రయాణపు గంటలు. టైమ్ చూశాడు. ఏడూ-పది. ఇంకో గంట. కాలమే జరగటం లేదు. "ఇంత స్పీడుగా దూసుకుపోతున్న ప్రయాణమే బోరంటే, బ్రతుకులో నీ వెలా ఏగుతావు?" వసంత పరిహాసం.

'వసంతా !' మూలిగింది మనసు. "నీవు నా కేమవుతావు? ప్రేమికవా? నేస్తానివా? నాకు తెలియకుండా నా జీవితంలోకి నడిచి వచ్చిన ఓ బాటసారీ - నీ గురించి నువ్వే తెలుసుకో అంటే ఎలా చెప్పు? మనిషికి తన కష్టకాలంలోనే గుర్తొస్తారు నిజమైన ఆత్మబంధువులు. ఈ అనుబంధానికి ఒక వ్యాఖ్య చెప్పు. వసంతా, వసూ ,,

గుండెలో నుంచి వెలువడిన ఆక్రందన నీటి బిందువు రూపంలో కంటి రెప్పల మధ్య చిక్కుపడి ఆగిపోయింది. ఎనౌన్స్‌మెంట్ వినిపిస్తోంది - కొద్ది నిమిషాలలో ప్లేను హైదరాబాద్‌లో లాండ్ అవబోతోందని.

సుమారు ఆరు నెలల క్రితం ఇదే సమయంలో కాబోయే పెళ్ళి కొడుకులా హుషారుగా దిగాడు. అదో స్వప్నం. పుష్పించి, ఫలించే అనుభూతి. వింత అలజడి. ఊహల సందడి.

'వసిడి గిన్నెలో పాల బువ్వ పెట్టానురా కన్నా వచ్చి తినరా' అనే ఆ అమ్మ పిలుపు. ఆశతో ఆకలిగా అందుకుని తినబోతుంటే, ఇది నీకోసం కాదు అంటూ దొర్లిపోయిం దా అవకాశం.

జీవితంలో మొదటి ఓటమి. మంచితనాని కో సవాల్. తప్పెవరిది? తనదా? సంధ్యదా? పెద్దలదా? విధిదా? ఎవరిని నిందించాలి ! చదువు, సంస్కారం, పరిస్థితులు కట్టు బాట్లు నేర్పిన విచక్షణ, ఓర్పు. అగాధంలో పడిపోయిన ఫీలింగ్ నుంచి తేరుకునేసరికి ఇన్ని రోజులు, ఇన్ని నెలలు. పనుల ఒత్తిడితో కొంత సాంత్వన.

## సిగ్గు

"సిగ్గు లేదూ ! పరీక్షలో తప్పడానికి. అక్కడికీ ట్యూషన్ కూడా పెట్టించాను కదరా !" అంది శ్యామల.

"ఏం టమ్మా ! నాన్నగారు ఎన్నికల్లో ఓడిపోతేనేమో ఓదార్చావ్. నన్ను మాత్రం తిడుతున్నావ్ చిన్నబుచ్చుకొంటూ అన్నాడు కమలేష్.

-వాలి వీణామాధురి
[హైదరాబాదు]

ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తుంటే, జైలు నుంచి బయటకు వస్తున్న వ్యక్తిని అందరూ చూస్తున్నట్లుగ ఫీలింగ్. తన రాక ఎవరికీ తెలియదు. ఎక్స్‌పోర్టర్స్ కాన్ఫరెన్స్ ఉందని రావాల్సి వచ్చింది.

తల వంచుకుని ముందు కెళ్తున్న శ్రీధర్ క్షణం ఆగి విన్నా డో గొంతు "త్యాగమూర్తులకు సుస్వాగతం".

వారం రోజులుగా అన్నం లేని బిచ్చగాడికి రోడ్డుమీద వంద రూపాయల నోటు కనిపించినప్పటి భావం.

నిజమా, అబద్ధమా అనే సంశయంలో కలిగిన భావన.

"వసూ !" పెదవులు ఆశ్చర్యంతో మరి పలకలేదు.

"నేను వసంతనే - రామకృష్ణ భార్యను, రవి తల్లిని, శ్రీధర్ స్నేహితురాలిని, చాలా ! ఇంకా చెప్పాలా?" కళ్ళు నవ్వుతున్నాయి.

ఆ హ్యూమరే ఆమెలోని ప్రత్యేకత !

"నీ వెలా వచ్చావు?"

"కారులో."

"అది కాదు, ఇక్కడి కెలా వచ్చావని?"

"నీ మీ దొట్టు, కారులోనే వచ్చాను."

కళ్ళలో కొంటెతనం. ఆమెతో మాట్లాడి జయించటం కష్టం. మనసులో అనుమానం. నేను వస్తున్నట్టు ఎలా తెలును? త నెప్పుడు వచ్చింది హైదరాబాదు? ఎన్నో ప్రశ్నలు.

కళ్ళద్దాలలో నుంచి ప్రకాశంగా నవ్వుతున్నాయి ఆమె కళ్ళు.

"మన జీవితాలు ఇంతకాలం ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. శేషజీవితంలో సమాధానాలు వెతుక్కోవడానికి ప్రయత్నిద్దాం. రా ! నిన్ను డ్రాప్ చేస్తాను."

హొటల్ ముందు కారాపి - "ఇప్పుడు ఎనిమిదిన్న రైంది. భోజనం చేసి రిలాక్సవు. మా మావయ్య కూడా ఇక్కడే ఉన్నారు. వేరేచోట డిన్న రుంది మాకు. రేపు ఉదయం ఏడు గంటలకు ఫోన్ చేస్తాను. గుడ్ నైట్." కారు వెళ్ళిపోయింది.

సముద్రంలో పడిపోయినవాణ్ణి. ఒక బలమైన కెరటం ఒడ్డుకు నెట్టి, వేగంగా కడలిలో కలిసిపోయిన అనుభూతి.

రాత్రి పది గంటలు.

చల్లదనాన్ని వెదజల్లే ఆ గదిలో శ్రీధర్ మనసు కూడా ముందటి టెన్షన్ తగ్గి ప్రశాంతంగా ఉంది. వసంతను చూసినప్పుడు కలిగిన ఆశ్చర్యం, భావావేశం తాలూకు వివరణను ఇప్పుడిందిస్తోంది మనసు. అంతక్రితమే తను వసూ వాళ్ళుండే హొటల్‌కు ఫోన్ చేశాడు. మావయ్యే [వసూ భర్త] తీశాడు. అరణ్యాల్లో తపస్సు చేసుకునే ఋషీశ్వరులు ఎట్లా ఉండేవారో పుస్తకాలలో చదువుతా రే, ఆయన నిజంగా అట్లాంటి కోవలోకే వస్తారు. అభిమానం, మర్యాద కలబోసిన పలకరింపు. పన్నీరుకు బదులు ఆత్మీయత నింపిన చిలకరింపు. వసూ లేదట. స్నేహితులతో సెకండ్ షో సినిమాకు వెళ్ళిందట. ఇదే ఆఖరి రోజట. ఈ సినిమాను మద్రాసులో చూసే అవకాశం లేదట. తన వ్యాపార విషయాలు అడిగాడు, ఎంతో ఎంకరేజింగ్‌గా చెప్పి ముగించారు. శ్రీధర్‌లో పెదవులు విచ్చుకోని ఒక నవ్వు రేఖ కదిలి కరిగిపోయింది.

ఉదయం ఏడు గంటలకు ఫోన్ మోగింది. ఆత్రంగా ఫోన్ తీశాడు.

"దిస్ మోణింగ్ ఈజ్ యంగ్."

"వసూ !"

"ఎన్ని గంటలకు మీటింగ్?"

"పది నుంచి. ఎప్పటికి ముగుస్తుందో చెప్పలేను."

"రాత్రి ఏడింటికి ఫ్లైట్ కూడా కదూ !"

"... ... !"

"ఓ.కే. బెస్టాఫ్ లక్ !"

గుండె గొంతులోకి వచ్చిన బాధ. తను అడగా లనుకున్న ఒక ప్రశ్నా బయటకు రాకముందే లైను కట్టయింది.

"ఓ ప్రియతమా ! ఎడారిలో ప్రయాణం చేస్తున్నవాడిని. ఒక్క గుక్కెడు నీళ్ళకోసం అలమటించే నాకు - ఒయాసిస్సులా కనిపించి, గుక్కెడు నీళ్ళు నోటికి అందుతాయని ఆశతో పరిగెత్తుకుంటూ వస్తుంటే, ఎండమావిలా దూరమైపోకు. నేనూ మనిషినే. నాకూ కావాలి ఓ చల్లటి ఓదార్పు. కన్నతల్లి మాట్లాడదు. బంధువులకు శత్రువు నైపోయాను. నే నో బలిపశువును. వీళ్ళందరూ నిర్దాక్షిణ్యంగా



వేటాడిన జంతువును. కానీ నాకు మిగిలిన ఆప్తురాలివి నీవే. నీ వాక్కదానివే. నీ మంచితనం, నాగరికత, దూరాలోచన నాకు తెలుసు. ఇదంతా రెండు నెలల క్రితం నీకు వివరంగా రాశాను. ఇదీ జరిగిందంటూ నీ ముందు పరిచాను, చదివావా? నాకు కావలసింది నీ జాలి కాదు. నాకు ఒక పరిష్కారం. సాంత్వన.

"ప్రతి క్షణం, ప్రతి దినం నీ జాబుకోసం ఎదురుచూశాను. రాలేదు. నిన్న కారుచీకటిలో కాంతి కిరణంలా కనిపించావు. ఆ వెలుగుతోనే నాకు ఒక దారి చెప్పు. శేషజీవితం అలానే నడిచి వెళ్ళిపోతాను."

చిన్నప్పుడు నేర్చుకున్న మెడిటేషన్, కాన్సంట్రేషన్ మనిషిని ఎంత కంట్రోల్ చేస్తాయో ఇప్పుడే అర్థమవుతోంది.

మీటింగ్ ముగిసి రూమ్‌కు చేరేసరికి మూడైంది. అందరూ తనను వింతగా చూస్తున్న ఫీలింగ్. నిజమే తన బ్రతుకులో జరిగిన అపశ్రుతి అలాంటిది. ఒక్కళ్ళూ నన్ను అడగరే? ఒక్కళ్ళూ నన్ను నిలబెట్టి తిట్టరే ! ఇదేనా నాగరికత ముసుగు అంటే? ఈమధ్య ఎవరో అన్నారు - హార్ట్ అటాక్‌లు గొప్పవాళ్ళకూ, పెద్దవాళ్ళకే గానీ సామాన్యులకు రాదని. ఎందుకంటే సామాన్యులు వాళ్ళ మనసులో భావేశాలను మాటలతోనూ, కన్నీళ్ళ రూపంలోనే బయటకు నెట్టేసుకుంటారు. అందుకే వాళ్ళకు గుండెలు ఎప్పటికప్పుడు ఖాళీ అయిపోతాయి. కానీ గొప్పవాళ్ళు అలా కాదు. ఎన్ని ఫీలింగ్స్ ఉన్నా బయటకు రానివ్వకుండా ఆ గుప్పెడు గుండెలోనే దాచేసుకుంటారు. దాంతో, టెన్షన్ ఎక్కువై ఒక్కసారి మంచి రోజు చూసుకుని ఫెయిల్ అయి ఊరుకుంటుంది. వినటానికి హాస్యంగా ఉన్నా, ఎంత నిజం ఉంది దానిలో?

ఫోన్ మోగింది. ఆత్రంగా తీశాడు.

అక్క శాంత గొంతు. మనం ప్రశ్నలడిగే తలనొప్పి లేకుండా ఆమె ముందే అన్నీ చెప్పేస్తుంది.

"నీవు వచ్చినట్లు వనూ చెప్పింది. మేము రెండ్రోజులుగా ఇంట్లో లేము. నీవు ఫోన్ చేశావా? మీ బావగారి కజిన్ సిస్టర్ లేదూ, అదే ఎం.ఎల్.ఏ. భార్య. వాళ్ళమ్మాయి పెళ్ళి రేపు. అందరం అక్కడే ఉన్నాము. నేను వాళ్ళింటి నుంచే చేస్తున్నాను. అమ్మ లేదు. దుగ్గిరాల వెళ్ళింది - పంట డబ్బు వసూలుకు. ఇంకా వారం వరకూ రాదు. రాత్రికి వెళ్తున్నావట కదా ! మళ్ళీ ఎప్పుడొస్తావు? ఈసారి ఎవరైనా వస్తే, నాకు కాశ్మీరు ప్రింటు చీరలు కావాలి. మరిచిపోకేం ! పిల్లలు బాగానే ఉన్నారు. ఇక్కడ అందరూ ఉన్నారు. ఇంకేం మాట్లాడలేను. మరి ఉంటాను."

వసంతకు ఫోన్ చేశాడు. రూమ్‌లో ఎవరూ లేరు. ఎక్కడో పెళ్ళి హడావుడిలో ఉన్న అక్కకు కూడా తనొ రాక వివరాలు చెప్పిన వసంతకు తనతో మాట్లాడే తీరిక లేదా? వీళ్ళంతా తన వాళ్ళు, ఆడవాళ్ళు.


మళ్ళీ ఫోన్ తీశాడు. ఆపరేటర్ లైన్‌లోకి వచ్చింది. "మిస్. నేను ఆరు గంటలకు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళాలి. గుర్తు చెయ్యండి. వేరే ఫోన్లేవీ కనెక్ట్ చెయ్యద్దు. నాకు విశ్రాంతి కావాలి, ప్లీజ్ !"

విస్కీ ఆర్డర్ చేశాడు. నాలుగైంది. ఇంకా రెండు గంటలు. మొదట్లో కంపెనీగా తాగేవాడు. తరువాత టైమ్ పాస్, ఇప్పుడు అదే రిలీఫ్ అయింది.

గ్లాస్ విండో కర్టెన్ పక్కకు జరిపాడు. హైదరాబాద్ నగరం సాయంత్రం ఎండలో మెరుస్తుంది. పెరిగిందీ, చదువుకుందీ ఇక్కడే. ఎంతమంది స్నేహితులు, ఎన్ని జోక్సు - అన్నీ తమవే ! వాళ్ళంతా ఏమయ్యారు? ఆ ఆనందం, సందడి ఏవీ? ఒక రూపాయ లాటరీ టిక్కెట్టు కొంటే యాభై లక్షలు. ఒక మనిషి కుటుంబం ఒక తరానికి సరిపోయే డబ్బు. రాకుంటే పోయేది కేవలం ఒక్క రూపాయి. లెక్కలోనికి రానిది. కానీ జీవితంలో ఒక సంఘటన - మనిషిని అధఃపాతాళానికి తోసేస్తుంది. భవిష్యత్తుకు ఒక ఛాలెంజ్ ! ఈ శిక్షకు ఆడా మగా భేదం లేదు. అసలేం జరిగింది జీవితంలో:

సరిగ్గా ఆరు నెలల క్రితం - అమ్మ ఫోను చేసింది ఢిల్లీకి. తన వ్యాపారం, నివాసం అంతా అక్కడే - అర్జెంటుగా రమ్మని. అమ్మ పాత - కొత్త కలయికల మనిషి. అన్ని పనులూ వదిలేసి అమ్మ కోరిక ప్రకారం రాత్రికే వచ్చాడు తను. అమ్మ, అక్క, బావగారు రాత్రంతా నూరిపోశారు. అమ్మకు దూరపు బంధువు లమ్మాయి ఉంది. ఆమెను అమ్మ చేతిలో తప్ప ఇంకెవరి చేతిలోనూ పెట్టరట. అమ్మ ఒకత్తే ఆమెను కడుపులో పెట్టుకు దాచుకుంటుందట. దాంతో అమ్మకు ప్రధానమంత్రి పదవి పొందినంత ఫీలింగ్.

తెల్లవారుజామునే అమ్మ, బావగారు, బాబాయి, అక్క, తనూ కారులో గుంటూరు బయలుదేరారు. ఎనిమిది గంటలు ప్రయాణం. హోటల్ గౌరీశంకర్‌లో బస. సాయంత్రం గుంటూరుకు ఇరవై కిలోమీటర్ల దూరంలోని ఒక పల్లెలో పెళ్ళిచూపులు. అమ్మాయిని తెచ్చి చూపించి



లోపలకు తీసుకెళ్ళిపోయారు. అమ్మ, అక్క కూడా పెద్ద వాళ్ళతో లోపల ఉండిపోయారు.

అమ్మాయి బావుంది. మంచి పర్సనాలిటీ, కాంప్లెక్షన్, లోపం లేదు. పోస్టుగ్రాడ్యుయేటు. గుంటూరులో యూనివర్సిటీ వీళ్ళందరకీ వరప్రసాదం. ఒక్కతే కూతురు. అభ్యంతరం పెట్టేందు కేమీ కనిపించలేదు. తన ప్రమేయం లేకుండానే అన్ని మాటలూ జరిగిపోయాయి. పది రోజుల వ్యవధిలో పెళ్ళి. దీనికి మాత్రం తను అడ్డు చెప్పబోతే - అమ్మాయి నాయనమ్మ అస్మా పేషెంటట. ఇవాళో, రేపో అంటూ ఉందట. తన ఏకైక మనవరాలి పెళ్ళి చూడకుండా రానంటూ, యమధర్మరాజుతో హోరాహోరీగా పోరాడుతుందట. అందుకే పెళ్ళి అనివార్యం.

ఎవరినీ పిలిచే వ్యవధి కూడా లేకుండా జరిగిపోయింది. మూడు రోజులు ఏవో పూజలు, వ్రతాలు, సంప్రదాయం. వెంటనే హైదరాబాదు ప్రయాణం. వచ్చీ రాగానే స్నేహితుల దండయాత్ర. పార్టీ, రిసెప్షన్ ఏర్పాట్లు. అందరిలో హడావుడి. ఎన్నో శుభాకాంక్షలు ! ఎన్ని రోజులగానో పోరుతున్నా ఇప్పటికి కోరిక తీరిన తృప్తి అమ్మలో. కానుకలు ఘనంగా అందిన ఆడబిడ్డ హోదాలో అక్క ఆర్భాటం.

ఆమె పేరు సంధ్య. నా భార్య. ఎంత మధురమైన పులకింత ! మాట్లాడాలనీ, తాకాలనీ ఏవో ఊహలు. గగుర్పాటు. పరవళ్ళు తొక్కే అంతరంగం. అక్క కొడుకు రాము - చాలా రహస్యంగా ఇచ్చాడు 'కొత్త అక్కయ్య నీ కిమ్మం'దని.

"మీతో మాట్లాడాలి. దయచేసి నన్ను బయటకు ఎక్కడికైనా తీసుకెళ్ళండి. ఒంటరిగా మాత్రమే !"

ఉద్వేగపు క్షణాలు. బంధువులను ఒప్పించి, అక్కయ్య సహాయంతో సంధ్యతో బిర్లా మందిర్ చేరాడు. మౌనంగా వచ్చి కూర్చుంది. ఆమెతో మాట్లాడే మొదటి మాట ఎంత మధురంగా ఉండాలో ఊహించుకుంటూ ఉంటే - ఆమే అంది - "శ్రీధర్, దయచేసి మంచి మనసుతో నేను చెప్పేది వినండి. ఉపోద్ఘాతాలు వద్దు."

ఆమె చెబుతోంది-

పశ్చిమాద్రి ఎరుపు సంధ్య ముఖంమీద ప్రతిఫలిస్తోంది - తనలో చిన్న అలజడి. అది పెరిగి పెరిగి మహాసర్పమై తనను చుట్టి, కొండ కొసనుంచి కిందికి విసిరేసింది. తను పడిపోయాడు - అగాధంలో పడిపోయాడు. లేవలేకపోతున్నాడు. 'ఎవరైనా రండి. నాకు చేయూత నివ్వండి.'

అప్పుడు గుర్తు వచ్చింది. తన ప్రాణమిత్రురాలు, నెచ్చెలి, ప్రియతమ అయిన వసంత. చెవిలో అంటుంది. 'శ్రీ ! లే ! నీ బలం ఏమైంది? ఇంత బేలవా? ఇంత బలహీనుడివా?'

నీరసంగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా తల వంచుకుని ఉంది సంధ్య. ఈ అమ్మాయి ఎంత స్థిరంగా కూర్చుంది. చదువు నేర్పిన మనోబలమా? బుద్ధి వికాసమా? అసలు ఆవేదన అంటే ఇదేనా?

ఈమే ఎవరు? తన భార్య. తన జీవిత భాగస్వామిని. దాంపత్య జీవితపు తొలి మెట్టుమీద ఇంకా అడుగు పెట్టనేలేదు. అప్పుడే కాదని వెళ్ళిపోతా నంటుంది. 'నువ్వంటే గౌరవిస్తాను. కానీ భర్తగా నిన్ను అంగీకరించ'నంటుంది. ఆమెకోసం ఎదురుచూసే మనిషి దగ్గరకు తనను పంపించమంటుంది.

ఎవరి దీ తప్పు? ఎక్కడ జరిగిం దీ లోపం? !

"అయిదు సంవత్సరాలుగా ఒకళ్ళ నొకళ్ళం బాగా ఎరుగుదుం. కలిసి చదువుకున్నాము. జీవితాన్ని కూడా కలిసి పంచుకుందా మనుకున్నాము. మనసా వాచా ఒక్కటయ్యాము. స్నేహితుల ప్రోద్బలంతో చికాగోలో జాబ్ వచ్చింది. నేను అక్కడికి వెళ్ళటానికి కూడా వీసా, టిక్కెట్టు, అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. అతనికి డబ్బు లేకపోవచ్చు. చదువు ఉంది. కులం లేకపోవచ్చు. సభ్యతా సంస్కారా లున్నాయి. అన్నిటికీ మించి నేనే అతనికి సర్వస్వం. నేనూ రీసెర్చి చెయ్యటానికి ఏర్పాట్లు జరిగాయి. ఇవన్నీ గుంటూరులో అతని స్నేహితుడు ఏర్పాటు చేస్తున్నాడు. కానీ దురదృష్టవశాత్తూ నేను లేని సమయంలో ఒక లెటర్ మా నాన్నగారి చేతిలో పడింది. తీగ లాగితే డొంకంతా కదిలింది. నే నా పల్లెటూళ్ళో బందీ నయ్యాను. ఈ రోజే నాకు విడుదల జరిగిం దనుకోవాలి. మిమ్మల్ని మోసం చేశా ననుకుంటే నా తప్పు కాదు. మీకు తెలియచేయాలని చాలా ఆరాటపడ్డాను. ఆ పల్లెటూళ్ళో ఎలాంటి అవకాశం లేక ఎంత దుర్భరమైన వేదన ననుభవించానో చెప్పినా మీరు నమ్మరు. ఆడపిల్ల మెళ్ళో మూడు ముళ్ళూ పడితే చాలు, అతడికి బానిసైపోతుందిలే అనుకునే మూర్ఖ లింట్లో పుట్టాను నేను.

"శ్రీధర్ ! నా మనసు నిండా శరత్ రూపమే ! మిమ్మల్ని చూస్తున్నా అతని భావనే తప్ప మరో ఫీలింగ్ లేదు నాకు. ఈ పెళ్ళి వార్త వింటే నా శరత్ గుండె పగిలి చచ్చిపోతాడు !"

సంధ్య కళ్ళలో అప్పటికి కనిపించింది నీటి తడి. అది కెరటమై కనురెప్పలను దాటి ముందుకు దూకి చెంపలమీదుగా జారింది.

"శరత్ ! మై బాయ్ ! కంగ్రాట్స్ ! ఈ ప్రపంచంలో ప్రేమించటం కంటే, ప్రేమించబడటం చాలా గొప్ప విషయం. మీ ఇద్దరి అనుబంధం ఎంత అపూర్వం ! పెళ్ళంటే కేవలం 'ఫిజికల్ నీడ్' అనుకునే చాలామందికి తెలియదు అందులోని మాధుర్యం. తనకు ఫోన్ రావడం, పెళ్ళిచూపులు, ఏర్పాట్లు, పెళ్ళి ఇప్పటివరకూ జరిగాయి. సినిమా రీలులా తిరగసాగింది. ఎవరిని నిలెయ్యాలి? ఎవరిది తప్పు? గొంతు కొయ్యటమంటే ఇదేనా? ఎవరి గొంతు? కచ్చితంగా తనదే ! విశాల సామ్రాజ్యానికి నేనే చక్రవర్తి ననుకుంటూ వచ్చిన తను సమస్త వైభవాలనూ పోగొట్టుకున్న వాడిలా ఇల్లు చేరాడు. సంధ్యతో మర్నాడు ఢిల్లీ రావడం, శరత్‌కు ఫోన్ చేసి పిలిపించటం, వాళ్ళను కలపటం, పాలం విమానాశ్రయంలో వా ళ్ళిద్దరికీ వీడ్కోలు ఇవ్వటంతో ముగిసింది ఆ అధ్యాయం.

తరువాత రెండువైపులా దాడి. తను వెధవ అన్నారు, చేతగాని దద్దమ్మ అన్నారు. కడకు బృహన్నల అని కూడా అన్నారు. జరగాల్సిన రభసంతా జరిగింది. అయినా ఒక తృప్తి. చీకటిలో చిరుదీపం. సంధ్య నిజాయితీ ఎందరి కుంటుంది? అప్పుడు మరోసారి గుర్తుకు వచ్చింది తన నెచ్చెలి వసంత !

చిన్ననాటి నేస్తం. ఒకే ఒక అప్తురాలు. అన్నీ వివరంగా, అంతరంగ మథనమంతా ఆమె ముందు పరిచాడు. తన మిత్రురాలు ఈ ఒంటరి ఓటమికి చిన్న సలహా ఇవ్వదా అంటూ ఎదురుచూశాడు, చూస్తున్నాడు.

ఇక్కడ ఉండాలని లేదు. బ్యాంకాక్‌లో తన మిత్రుడు నడిపే చైన్ హొటల్‌కు తనను మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉండమంటూ పిలుస్తున్నాడు. త్వరలో తన వ్యాపారం కూడా అక్కడికే తరలించాలని ఉంది. అన్ని ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి కూడా. కొత్త దేశం, కొత్త వాతావరణం. ఇంకో నెలలో స్వదేశానికీ, అందరికీ గుడ్ బై.

ఫోన్ మోగింది. ఆపరేటర్ కంఠం.

"సారీ, సర్ ! మీకు ఎయిర్‌పోర్ట్‌కు టైమైంది."

ఎయిర్‌పోర్ట్‌కు చేరేసరికి ఇక అట్టే టైము లేదు. బోర్డింగ్ పాస్ తీసుకుంటుంటే, టిక్కెట్టుపైన పేరు చూసిన ఆఫీసర్ - "ఆర్ యూ, శ్రీధర్ ' అని అడిగి - "మీ కో లెటర్ ఉం దిక్కడ" అంటూ ఇచ్చాడు. వసంత రాసింది. జీవితమే దాగుడుమూతలు.

సీట్‌లో సెటిలయ్యాక విప్పా డా ఉత్తరాన్ని.

"శ్రీ !

నీ ఉత్తరం చేరింది రెండు నెలల కిందట. నీకు పెళ్ళి జరగటం తెలుసు. నాకు ఆహ్వానం రాలేదని క్షణం తిట్టుకున్నా జీవితంలో ముఖ్యమైన. ఈ మలుపు శుభప్రదం కావాలని కోరుకుంటున్నాను. సంధ్యారాగంలో ఈ ప్రపంచాన్నే మరిచిపోయి ఉంటావని అసూయ కలగకపోలేదు - అది క్షణం మాత్రమే ! కానీ నేను వసూని. వసంతను !

నీ ఉత్తరం అందుకున్నప్పుడు బరువు చూసి ఆశ్చర్యం వేసినా, ఎన్ని తీపి తేనెలు నాకు చెబుతున్నావో అని సంబరపడ్డాను. తీరా చదివాక... ఇది నిజమా ! ఇంత శిక్ష, ఎప్పుడూ ఏడవటం రాని నాకు ఏడుపు ఆగింది కాదు. క్షణాలలో రావాలనీ, నిన్ను నా ఒడిలో దాచుకోవాలని ఎన్నో... ఎన్నో... ఎంత భారం... ఎంత పరితాపం...

శ్రీ !

త్యాగశీలుడవని మెచ్చుకోనా ! మూర్ఖుడివని తిట్టనా? స్పోర్టివ్‌గా తీసుకున్నందుకు అభినందించనా? ఎన్నోసార్లు నీకు రాయాలని ప్రయత్నించాను. ఈ కన్నీరు ఆగేది కాదు. కలం సాగేది కాదు.

ఏమని రాయను ప్రియమిత్రమా?

కాలం ఎంతటి గాయా న్నయినా మాన్పుతుంది. ఆ శక్తి కాలానికే ఉంది. లేకుంటే దుఃఖభారంతో సజీవ సమాధులయ్యే వాళ్ళకు అంతు లేకుండేది. ఈ ప్రపంచం చాలా విశాలమైంది. సంధ్య పోయినంతలో సంధ్యారాగం పోదు కదా ! మనం లేకున్నా సంధ్యారాగం నిరంతరం ఉంటుంది. దీనిలో బాధకు తావేది? నీవు సంధ్యను ప్రేమించేవా? - మీ అనుబంధం ఎంతసేపు? కొన్ని గంటలు. తాళి కట్టిన భాగ్యానికే నీ కింత బాధ కదా ! అది తెంచుకుపోయిన ఆమెకు లేని బాధ నీ కెందుకు? మనసు ఒకచోట పారేసుకుని, తాళి మరికరితో కట్టించుకుని, పరిస్థితులకు రాజీ పడలేక ప్రతి క్షణం చిత్రవధ అనుభవించే ఎందరో సగటు అమ్మాయిల కంటే సంధ్య ఎన్నో రెట్లు నయం. ఇది సమర్థన కాదు. పచ్చి నిజం.


నీ వైరాగ్యానికి అర్థం లేదు. ఏదో రాసి నిన్ను నొప్పిస్తున్నా ననుకుంటే క్షమించు. నిన్ను చూసిన వెంటనే పోట్లాడా లనిపించింది. తిట్టా లనిపించింది. ఇన్ని రోజుల నుంచి ఎంత సెల్ఫ్ పిటీతో బాధపడుతున్నావో నిన్ను చూస్తేనే అర్థమైంది. అలాంటి మనుషులంటే నాకు పరమ అసహ్యం. అందుకే నిన్ను తప్పించుకుని తిరిగాను.

శ్రీ !

నీకు మందేమిటో తెలుసా? ! నీలదీసి అడగటం. ఆత్మవిమర్శ చేసుకోనమనటం. అందుకే కొన్ని రోజులు దేశం విడిచిపెట్టెయ్యి. ప్రదేశం, వాతావరణం మారితే మిగిలిన మార్పులు వాటంతటవే వస్తాయి. నీ వెనుక నే నెప్పుడూ ఉంటాను. ఈ నరకం నుంచి దూరంగా పోతే అదే స్వర్గం. అక్కడ రంభ, ఊర్వశి, మేనకలు ఉంటారు. సకల పరిచర్యలు చేస్తారు.

మునుపటి శ్రీధర్‌లా ఉన్నప్పుడు రాయి. మనం కలుసుకుందాం. జస్ట్ బిగినింగ్ ఫర్ ఏన్ ఎండ్ ! బై !"

మేఘాలను చీల్చుకుంటూ ముందుకు దూసుకుపోతోంది ఏర్‌బస్ ఢిల్లీ వైపుగా. ★



అలపర్తి ఉషారాణి. నందివెలుగు.